ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 27.5 ; కనిష్ఠం 21.4
కామారెడ్డి జిల్లా వార్తలు
5
శనివారం 27 జులై 2024

మెడికల్ ఆఫీసర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి టౌన్, జూలై 26: జాతీయ ఆరోగ్యమిషన్ కింద బాన్సువాడలోని బస్తీ దవాఖానాలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఏడాది పాటు మెడికల్ ఆఫీసర్‌గా పని చేయుటకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు వెంట ఎంసీఐ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్, మార్క్స్‌మెమోలు, 4 నుంచి 10వ తరగతి వరకు చదివిన సర్టిఫికెట్‌లు, కులధ్రువీకరణ పత్రాలు జతపరిచి ఈనెల 30లోగా కామారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.


రాజీవ్‌నగర్ డబుల్‌బెడ్‌రూం వద్ద కలెక్టర్ రావడంతో ఎన్నోరోజులుగా నిల్వ ఉన్న మురికిని తొలగించిన దృశ్యం


కామారెడ్డిలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న కలెక్టర్


బిచ్కుందలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

చినుకు.. వణుకు!

- జిల్లాపై పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల బెడద
- ప్రజలు విష జ్వరాల బారిన పడే అవకాశం
- మురికివాడల్లో లోపిస్తున్న పారిశుధ్యం
- మారుమూల గ్రామాలు, తండాల్లోనే అధిక కేసులు
- ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీలలో వైద్యం అంతంత మాత్రమే
- కామారెడ్డి మున్సిపల్‌లోని డబుల్ బెడ్‌రూంల వద్ద పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తం
- కలెక్టర్ వస్తుండడంతో ఆగమేఘాల మీద పారిశుధ్య నిర్వహణ
- మురికివాడల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజల డిమాండ్

కామారెడ్డి, జూలై 26(ఆంధ్రజ్యోతి): జిల్లా అంతటా ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలు పడడంతో ఓ వైపు ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నా మరోవైపు సీజనల్ వ్యాధులు కలవరపెడుతున్నాయి. ప్రతీ ఏడాది చినుకు పడిందంటే మారుమూల గ్రామాలు, తండాలవాసులు విష జ్వరాలతో వణికిపోతున్నారు. ఇప్పటికే మారుమూల ప్రాంతాల ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడి ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. కామారెడ్డి జిల్లా పరిధిలో దాదాపు వెనకబడిన ప్రాంతాలతో పాటు మురికివాడలు అధికంగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ఆరోగ్యంపై, పారిశుధ్యంపై స్థానిక ప్రజలకు అవగాహన లేకపోవడం వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు, విష జ్వరాల బారిన పడుతున్న పరిస్థితి నెలకొంటుంది. జిల్లా పరిధిలో ప్రతీ మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు ఏరియా ఆసుపత్రులు ఉన్నప్పటికీ ప్రజలకు వైద్యసేవలు అంతంతా మాత్రంగానే అందుతున్నాయి. పలు ఆసుపత్రుల్లో సరిపడా మందులు లేకపోవడం, రోగం వస్తే మందు గోళి ఇచ్చేందుకు సరిపడా సిబ్బంది లేకపోవడం మరింత ఆందోళనకు గురి చేస్తోంది. ఈ నేపథ్యంలో ఈ వర్షాకాలంలో ప్రజలు డెంగ్యూ, మలేరియా లాంటి విష జ్వరాల బారిన పడకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తం కావలసిన అవసరం ఎంతైనా ఉంది.

మందులు అంతంత మాత్రమే

జిల్లా పరిధిలోని జీజీహెచ్, ఏరియా ఆసుపత్రులతో పాటు పీహెచ్‌సీలలో సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందు గోళీలు, వ్యాక్సిన్‌లు, అన్ని రకాలు మందులు అంతంత మాత్రంగానే ఉండడం పలు ఆసుపత్రులు మందులు ఉన్న వాటిని అందించేందుకు వైద్యులు కాని, సిబ్బంది లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణాలతో పాటు గ్రామీణ, తండాల్లో అధిక మొత్తంలో ప్రతీసారి డెంగ్యూ, మలేరియా, విష జ్వరాల బారిన పడినవారే అధికంగా ఉంటున్నారు. వీరంతా ఏరియా ఆసుపత్రితో పాటు ప్రాథమిక ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఈ ఆసుపత్రుల్లో రోగాలను నయం చేసేందుకు అన్ని రకాల మందులు అందుబాటులో లేకపోవడం జగమెరిగిన సత్యం. ఉన్న మందు గోళీలను ఏ పద్ధతితో వాడాలో తెలిపేందుకు వైద్యులు, సిబ్బంది లేకపోవడం, ఉన్నచోట సిబ్బంది అంతంత మాత్రంగానే విధులు నిర్వహిస్తుండడంతో ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంటుంది. విష జ్వరాల బారిన పడే మరికొందరు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందేందుకు స్థోమత లేక అరకొర సేవలతో ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేద ప్రజలకు సరైన వైద్యం అందక ప్రాణాలు పోయిన సంఘటనలు ఉన్నాయి.

కామారెడ్డిలోని పలు కాలనీల్లో మురుగు నీటితో ప్రజల అవస్థలు

కామారెడ్డి పట్టణంలో 17 వరకు మురికి వాడలు ఉన్నాయి. ఈ మురికి వాడల్లో పారిశుధ్య సమస్య లోపించడం ఆరోగ్యం పట్ల స్థానిక ప్రజలకు అవగాహన లేకపోవడంతో అనారోగ్యం పాలవుతున్నారు. ఈ మురికి వాడలో దోమలు, ఈగలు, పందుల స్వైర విహారం చేస్తుండటంతో వాటి బారిన పడుతూ విషజ్వరాల పాలవుతున్నారు. తీరా వైద్యం కోసం ఆసుపత్రులకు వెళ్తే సరైన వైద్యులు లేకపోవడంతో వైద్య చికిత్సలు అందటం లేదని ప్రజలు వాపోతున్నారు. పలు కాలనీల్లో మాస్ క్లీనింగ్ చేపడుతున్నా మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించడం లేదని వాదనలు వినిపిస్తున్నాయి. తూతూ మంత్రంగా సిబ్బంది పలుచోట్ల మాస్ క్లీనింగ్ పనులలో పాల్గొంటున్నారని ఆరోపణలు గుప్పిస్తున్నారు. వారిని పర్యవేక్షించాల్సిన అధికారులు కార్యాలయాలకు పరిమితం అవడం, జవాన్‌లు తమ సొంత వ్యాపాకాలపై దృష్టి సారిస్తున్నారని వాదనలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా బతుకమ్మకుంట, అయ్యప్ప నగర్, హరిజనవాడ, రాజీవ్‌నగర్, ఇంద్రానగర్, వాంబేకాలనీ తదితర కాలనీల్లో ప్రతీ సంవత్సరం మురుగునీరు పెరుకపోవడం, రోడ్లపై మురుగునీరు పారడంతో పాటు దోమలు, ఈగల సంతతి పెరిగిపోయి ప్రజలు అవస్థలు పడుతున్నా మున్సిపల్ యంత్రాంగం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి. శుక్రవారం సైతం రాజీవ్‌నగర్ కాలనీ డబుల్ బెడ్‌రూం కాలనీ వద్ద నిత్యం ప్రజలు పడుతున్న అవస్థలను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ దృష్టికి వెళ్లాయి. అక్కడ నివసించే వారికి డబుల్ బెడ్‌రూంలు కేటాయించారే తప్ప సరైన మురికి కాలువల నిర్మాణం లేదు. ఈ పరిసరాల్లోనే భారీ గుంతలో ఎన్నో రోజులుగా నిల్వ ఉన్న మురికి నీటిని చెత్తను కలెక్టర్ వస్తున్నాడని ఆగమేఘాల మీద శుక్రవారం తొలగించారు. పందుల స్వైర విహారం, పైనున్న కాలనీల నుంచి నీరంతా వచ్చి డబుల్ బెడ్‌రూంల వద్ద మురికినీరు చేరడంతో ప్రజలు వాసన భరించలేకపోవడంతో పాటు దోమల బాధతో వ్యాధుల బారిన పడుతున్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి

కామారెడ్డి జిల్లాలోని అన్ని మండలాల్లో దాదాపు పీహెచ్‌సీలు అందుబాటులో ఉన్నా ఆయా ప్రాంతాల్లోని గ్రామీణ తండాల ప్రాంతాల్లోని అధిక మొత్తంలో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. మారుమూల గ్రామాల తండాల్లో ప్రధానంగా పారిశుధ్యం లోపించడంతోనే దోమకాటు లాంటి వ్యాధులకు గురవుతున్నారు. వర్షాలు కురుస్తున్నందున గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా పట్టణ ప్రాంతాల్లోనూ ప్రజలు సీజనల్ వ్యాధులకు గురయ్యే అవకాశం ఉందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలతో పాటు జిల్లా యంత్రాంగం కూడా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మండల స్థాయిలో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బందిని అందుబాటులో ఉంచడంతో పాటు వైద్య సేవలను అందించాలి. సీజనల్ వ్యాధులు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానికి ఆయా శాఖలకు చెందిన సిబ్బంది మండలాలు, గ్రామాలు, తండాలను పర్యటించాలి. ప్రధానంగా వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, మున్సిపాలిటీ, నీటి పారుదల శాఖ అధికారులు సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు పడకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సాగర్‌లోకి వరద వచ్చేనా?

- నిజాంసాగర్ ప్రాజెక్టు నిండేనా.. సిరులు పండేనా?
- సాగర్‌లో 3.5 టీఎంసీలు, సింగూరులో 13.962 టీఎంసీల నీటి నిల్వ


నిజాంసాగర్‌లో అడుగంటిన నీటి నిల్వలు

నిజాంసాగర్, జూలై 26: ఉభయ జిల్లాల వరప్రదాయిని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టులోకి సకాలంలో వరదనీరు వచ్చి సాగర్ నిండుతుందా లేదా అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ యేడు వర్షాకాలంలో లక్షా 15వేల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. ఆయకట్టు కింద వేసిన వరి పైరు కనువిందు చేస్తోంది. వర్షాకాలం ప్రారంభమై నెల 20 రోజులు గడుస్తున్నా వర్షాకాలంలో భారీ వర్షాలు కురియకపోవడంతో నిజాంసాగర్, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సింగూరులోనికి అతి స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఉభయ జిల్లాల రైతాంగం ముందస్తుగా ఆయకట్టు కింద నాట్లు పూర్తి చేశారు. రెండు విడతలుగా రెండున్నర టీఎంసీల నీటిని ఆయకట్టుకు వదిలారు. ఎగువ ప్రాంతంలో వర్షాభావ పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉండటంతో సింగూరు నిండటం లేదు. నిజాంసాగర్ ప్రాజెక్టులో కూడా నీరు అడుగంటి పోయాయి. సాగర్‌లో 17.802 టీఎంసీలకు గాను 3.5 టీఎంసీల నీరు ఉంది. అడుగంటిన నీటి నిల్వలే ఉండటం విశేషం. నిజాంసాగర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో సింగూరులో 13.962 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. ఎగువ ప్రాంతం నుంచి 1120 క్యూసెక్కుల వరదనీరే వచ్చి చేరుతోంది. నిజాంసాగర్ క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన వర్షాలకు 680 క్యూసెక్కుల నీరు రావడం గమనార్హం. ఉమ్మడి జిల్లాల రైతాంగం ప్రాజెక్టులో నీరు లేకపోవడంతో నిరాశ చెందుతున్నారు. అతి స్వల్పంగా వర్షాలు నమోదు కావడం, భారీ వర్షాలు కురియకపోవడంతో రైతన్నలు దిగాలు చెందుతున్నారు. సింగూరు నిండితే భారీ వరద నీరు వచ్చి చేరుతుందని, నిజాంసాగర్ ప్రాజెక్టుకు ప్రతీయేటా పోచారం ద్వారానే వచ్చిననీటితో నిండుతోంది. పోచారం ప్రాజెక్టులోనికి స్వల్పంగా వరద నీరు వస్తుండటంతో క్రమేపి నీటి నిల్వలు పెరుగుతున్నాయి. ఈ ఏడాది పోచారం, నిజాంసాగర్ ప్రాజెక్టులతో పాటు సింగీతం రిజర్వాయర్ల కిందట పూర్తిస్థాయిలో వరి నాట్లు వేశారు. ప్రాజెక్టులు వెలవెల బోతుండటంతో ఆయకట్టు కింద వేసిన వరి పంటలు గట్టెక్కేనా అని రైతులు వాపోతున్నారు. ప్రతీయేటా నిజాంసాగర్ ప్రాజెక్టు పోచారం వరద నీరు, క్యాచ్‌మెంట్ ఏరియాలోని వాగులు, వంకలు నిండి ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వచ్చేనా అని పరిశీలకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఉభయ జిల్లాల అన్నదాత అయిన ప్రాజెక్టులో ఈ ఏడాది సకాలంలో నిండితే వర్షాకాలం, యాసంగిలో కూడా పుష్కలంగా పంటలు పండవచ్చని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు సక్రమంగా కురియకపోవడంతోనే చెరువులు, కుంటలు వెలవెలబోతున్నాయి. ఈ ఏడాది భారీ వర్షాలు కురియకపోతే రైతులకు గడ్డు కాలమే.

పోచారం ప్రాజెక్టులో స్వల్పంగా పెరుగుతున్న నీటి మట్టం

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టు నీటి మట్టం 8.7 అడుగులకు చేరుకుంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పోచారం ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమక్రమంగా పెరుగుతోంది. పోచారం ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో ఇటీవల కురిసిన వర్షాలతో లింగంపేట, గుండారం వాగుల ద్వారా ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టులో నీటి మట్టం పెరుగుతోంది. శుక్రవారం సాయంత్రానికి ప్రాజెక్టులోకి 8.7 అడుగుల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 1.820 టీఎంసీలకు గాను ప్రస్తుతం 0.405 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టులోకి శుక్రవారం 664 క్యూసెకుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు ఎల్లారెడ్డి నీటి పారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

కామారెడ్డిలో కలెక్టర్ సుడిగాలి పర్యటన


డబుల్ బెడ్ రూం ఇళ్ల పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్, జూలై 26: కామారెడ్డి మున్సిపల్ పరిధిలో శుక్రవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సుడిగాలి పర్యటన చేపట్టారు. పట్టణ పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీ వద్ద గల డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు మురికి కాలువలను శుభ్రపరచాలని, ప్రజలకు తాగునీటి సదుపాయం కల్పించేలా చూడాలని ఆదేశించారు. ప్రజలు ఎవరైన రోడపై చెత్త వేసిన చో పెనాల్టీలు విధించాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. అదే విధంగా కామారెడ్డి పెద్దచెరువు వద్ద గల ఫిల్టర్‌బెడ్, డీఆర్‌సీసీ సెంటర్‌ను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొచ్చెరి మైసమ్మ వేడుకలు


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మైలారం గ్రామస్థులు

నసురుల్లాబాద్, జూలై 26 : ప్రతీ సంవత్సరం ఆనవాయితీగా కొచ్చెరి మైసమ్మ పండగను మైలారం గ్రామస్థులు నిర్వహిస్తారు. కొన్ని సంవత్సరాల నుంచి గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు చేసేవారు. అప్పటి నుంచి ఆలయానికి మైలారం గ్రామస్థులు ప్రతీ సంవత్సరం ఆషాఢ మాసంలో, మొదటి రోజు బోనాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రెండవ రోజు కుటుంబ సమేతంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించి ఇంటికి వచ్చిన ఆడపడుచులతో కుటుంబ సభ్యులతో అక్కడే వన భోజనాలు ఏర్పాటు చేసి తింటారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు.. పరిష్కారమయ్యేనా?

- సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీల వేడుకోలు
- ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్


సమస్యల పరిష్కారం కోసం ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు(ఫైల్)

బాన్సువాడ టౌన్, జూలై 26: బాల బాలికలకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం అంగన్‌వాడీ వ్యవస్థను ప్రవేశపెట్టింది. అయితే అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించే సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం కొంత వాటా, రాష్ట్ర ప్రభుత్వం కొంత వాటా కలిపి వేతనంగా చెల్లిస్తాయి. కానీ ఏళ్ల తరబడి అంగన్‌వాడీ టీచర్లుగా విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ వారి సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరకుల ధరలు అంగన్‌వాడీల జీవనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. చాలీచాలని వేతనాలతో బతుకు జట్కా బండిని లాగాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు వచ్చినా వాటిని తప్పకుండా పాటించే వారిలో అంగన్‌వాడీలే ప్రథమంగా ఉంటారు. కానీ ప్రభుత్వం వారి సేవలను గర్తించకపోగా చిన్న చూపు చూడటం తగదని అంగన్‌వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇవీ డిమాండ్లు..

- అంగన్‌వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
- కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి
- పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత సౌకర్యాలు కల్పించాలి
- హెల్త్ కార్డులను అందజేయాలి
- వేసవిలో ప్రభుత్వ పాఠశాలలతో సమానంగా అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించాలి
- ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి
- పక్కా భవనాలు, మౌలిక వసతులు కల్పించాలి


వెయ్యి మందికిపైగా విధుల నిర్వహణ

కామారెడ్డి జిల్లాలో బాన్సువాడ, మద్నూర్, ఎల్లారెడ్డి, కామారెడ్డి, దోమకొండ అంగన్‌వాడీ ప్రాజెక్టులు ఉన్నాయి. సుమారు 1000 మంది ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లుగా విధులను నిర్వర్తిస్తున్నారు. బాన్సువాడ ప్రాజెక్టులో 9 సెక్టార్లున్నాయి. మొత్తం 234 కేంద్రాల్లో 234 మంది అంగన్‌వాడీ టీచర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ఏళ్ల తరబడి విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ వారి వేతనం అంతంత మాత్రంగానే ఉంది. ప్రస్తుతం 13వేల 500 రూపాయలు మాత్రమే అందుతోంది.

ఎన్నికల వేళ.. హామీల వరద!

అసెంబ్లీ ఎన్నికల సమయంలో నాయకులు ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంగన్‌వాడీలకు న్యాయం చేస్తామని, వారి డిమాండ్లను పరిష్కరిస్తామని హామీల వరద పారిస్తున్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం మాత్రం అంగన్‌వాడీలను చిన్న చూపు చూస్తున్నారు. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా అంగన్‌వాడీల ఊసే ఎత్తడం లేదని యూనియన్ నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు మండిపడుతున్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి


- ఖలీల్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు

ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి. గత ప్రభుత్వం అంగన్‌వాడీలకు సముచిత న్యాయం చేయలేకపోయింది. ప్రస్తుత ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలి. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.



ఘనంగా బోనాల పండుగ

నిజామాబాద్ అర్బన్, జూలై 26: నగరంలో శుక్రవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. అమ్మవారి వేషధారణలో చిన్నారులు అలరించగా.. బోనాలు ఎత్తుకొని మహిళలు సందడి చేసింది. ఈ సందర్భంగా చిన్నారులు ఆటపాటలతో ఊరేగింపుగా బోనాలను తీసుకెళ్లారు. పోతరాజుల వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు.








సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన

ఆర్మూర్‌రూరల్, జులై 26: ఆలూర్ మండల కేంద్రంలో దేగాం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యసిబ్బంది సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యసిబ్బంది ఇంటింటికి తిరుగుతూ నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెంది వ్యాధులు సోకుతాయని వివరించారు. వంట పాత్రలు, ప్లాస్టిక డబ్బాలు, కొబ్బరి చిప్పలు, టైర్లలో నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. ప్రతీఒక్కరు ఇంటిలోని చెత్తను పంచాయతీ ట్రాక్టర్‌లో వేయాలని, వీదుల్లో పరవేయవద్దన్నారు. తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకుంటే సీజనల్ వ్యాధులు బారిన పడకుండా ఉండవచ్చని వైద్యులు డాక్టర్ దినేష్, డాక్టర్ మైత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజలింగం, వైద్య సిబ్బంది జెస్సీ, యమున ప్రసన్న, ఆశవర్కర్‌లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.







28న బ్యాడ్మింటన్ అండర్-11,13 బాలబాలికల ఎంపికలు

సుభాష్‌నగర్, జూలై 26: బాడ్మింటన్ ఎంపికలను ఈనెల 28వ తేదీన నిర్వహిస్తున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కర్నాటి వాసు, కిరణ్‌కుమార్‌లు తెలిపారు. మోపాల్ మండలంలోని ఫిట్‌నెస్ బ్యాడ్మింటన్ అకాడమిలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అండర్-11, 13 బాల బాలికల విభాగంలో సింగిల్, డబుల్స్ విభాగంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు ఆధార్ తెచ్చుకోవాలని ఉదయం10గంటల వరకు మైదానానికి చేరుకోవాలన్నారు.

కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న జవాన్‌కు సన్మానం

బోధన్‌రూరల్, జూలై 26: పట్టణంలోని విజయసాయి ఉన్నత పాఠశాలలో కార్గిల్ విజయోత్సవ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ యుద్ధంలో పాల్గొన్న వీర జవాన్ చంద్రశేఖర్ మోత్కురిని శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. దేశ సంరక్షణలో సైనికులు తమ విధులను ఏ విధంగా నిర్వర్తిస్తారో వివరించారు. విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం కార్గిల్ యుద్ధంలో మృతి చెందిన వీర జవాన్‌లకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విజయసాయి హైస్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్ మాట్లాడుతూ వీర జవాన్ చంద్రశేఖర్ మోత్కురి అనేక సంవత్సరాలుగా ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహించారని గుర్తు చేశారు. 1994లో ఆర్మీలో చేరిన చంద్రశేఖర్ 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో పాల్గొని తనదైన శైలిలో శత్రువులతో పోరాడారన్నారు. 2011సంవత్సరంలో పదవీ విరమణ అనంతరం డీఎస్సీ రాసి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా నియామకం అయ్యారన్నారు. ఇలాంటి వీరజవాన్‌ను సన్మానించడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఆర్.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో శుక్రవారం సిల్వర్ జూబ్లీ కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. కార్గిల్ యుద్ధం లో పాకిస్థాన్‌పై విజయం సాధించి తిరిగి మా భూబాగాన్ని స్వాధీన పర్చుకొని విజయం సాధించిన జవాన్‌లకు జేజేలు పలకడం జరిగిందని, అందులో భాగంగా అమర్‌జవాన్‌లకు నివాళులు అర్పించి మాజీసైనికులైన థామస్, అశోక్‌లను శాలువ, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ అర్మూర్ అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్, కార్యదర్శి మేక శ్రీకాంత్, ప్రాజెక్టు చైర్మన్ అంబాల్ల తిరుపతి, కళాశాల ప్రిన్సిపాల్ కనక మహాలక్ష్మీ, లెక్చరర్‌లు దేవరాం, గంగాధర్, లయన్స్‌క్లబ్ సభ్యులు చెన్న రవికుమార్, ద్యాగ ఉదయ్, శశిధర్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

నిజామాబాద్ లీగల్: జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని సరస్వతీ చౌరస్తా వద్ద కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షుడు జగన్మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. 1999 జూలై 26న కార్గిల్ వర్సెస్ పాకిస్తాన్ యుద్ధంలో సైన్యాన్ని తరిమి కొట్టిన భారత సైన్యం విజయకేతనం ఎగరవేసి నేటితో 25 సంవత్సరాలు గడుస్తుందని అన్నారు. కార్గిల్‌లో జరిగిన యుద్ధంలో ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన అమరవీరులను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది రాజ్‌కుమార్ సుబేదార్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.రాజు, ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

మోపాల్ మండలంలో..

మోపాల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు జాతీయ జెండాను చేతపట్టుకొని జై భారత్ అంటూ నినాదాలు చేశారు. దేశం కోసం పోరాడి అమరులైన సైనికులను స్మరించుకున్నారు. యువత వారి అడుగుజాడల్లో నడుచుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సిరిపూర్‌లో బారేడు పోచమ్మ పండుగ

మద్నూర్, జూలై 26 : డోంగ్లి మండలంలోని సిరిపూర్ గ్రామంలో భక్తి శ్రద్దలతో బారేడు పోచమ్మ పండుగను గ్రామస్తులు సామూహికంగా జరుపుకున్నారు. శుక్రవారం తెల్లవారు జాము నుంచి మహిళలు ఆలయానికి తరలివచ్చి బోనాలను సమర్పించారు. ప్రతి ఏడాది ఆషాడ మాసంలో బారేడు పోచమ్మ పండుగ జరుపుకోవడం అనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా గ్రామస్తులందరూ కలిసి సామూహికంగా పండుగను భక్తి శ్రద్దలతో కన్నుల పండుగగా జరుపుకున్నారు. అమ్మవారికి సమర్పించే బోనంలో అన్నం పసుపు వండిన పదార్థాలు ఉంచి దానిని ప్రసాదంగా స్వీకరించారు. బోనం కుండకు పసుపు రాసి కుంకుమ బొట్టు పెట్టి వేపాకులను మాలలుగా చుట్టి తయారు చేసిన బోనాలు చూడటానికి ఎంతో ఆకర్షణగా కనిపించాయి.

'చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి'

బిచ్కుంద, జూలై 26: గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 30న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమానికి జుక్కల్ నియోజకవర్గంలో గ్రామపంచాయతీ సిబ్బంది తరలిరావాలని సీఐటీయూ జిల్లా సభ్యుడు సురేష్‌గోండ పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీ కార్మికులందర్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీసవేతనం రూ.18 వేలు ఇవ్వాలని కార్మికులందరికి రూ.10 లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలని, మల్టిపర్పస్ విధానం రద్దు చేయాలని అన్నారు. బకాయిపడిన వేతనాలు చెల్లిస్తూ ప్రతినెల 2న వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

పదోన్నతిపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

ముప్కాల్, జూలై 26: ముప్కాల్ మండలం నాగంపేట్ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహించి పదోన్నతిపై వెళ్తున్న ఉపాధ్యాయులు రాజేందర్, గంగాధర్, బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు ఆనంద్, సరితలను శుక్రవారం కాంప్లెక్స్ హెచ్‌ఎం గంగాధర్ శాలువ, మెమోంటోలతో సన్మానించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ కెఎం.రెడ్డి, రెంజర్ల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, నాగంపేట్ ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్, ప్రసాద్, నరేందర్, నవీన్, పంచాయతీ కార్యదర్శి గౌతమి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



రుణమాఫీకి 156 మంది రైతులు దూరం!

● రుణాల వివరాలు ఆన్‌లైన్ చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం ● మాఫీ కోసం ఆందోళకు సిద్ధమవుతామంటున్న రైతులు

సిరికొండ, జూలై26: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో పని చేసే సిబ్బంది నిర్వాకంతో పంట రుణాలు తీసుకున్న రైతులు రుణమాఫీకి దూరమయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రైతులు తీసుకున్న పంట రుణాలను మాఫీ చేస్తుండగా మండలంలోని రెండు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలోని 156మంది రైతులు రుణ మాఫికి అర్హత కోల్పోయారు. 2023 డిసెంబర్ 6 వరకు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో స్వల్పకాలిక (పంట) రుణాలను రైతులు తీసుకున్నారు. సహకార సంఘాల్లో పనిచేసే సిబ్బంది వెంటవెంటనే ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయకుండా నిర్లక్ష్యం చేయడంతో 156మంది రైతులు రుణమాఫీకి దూరమయ్యారు. సిరికొండ సహకార సంఘం నుంచి రుణమాఫీ కోసం 578 మంది రైతుల జాబితాను, తూంపల్లి సహకార సంఘానికి చెందిన 605 మంది రైతుల జాబితాను ప్రభుత్వానికి పంపించారు. ప్రభుత్వం రుణమాఫీ కోసం ప్రభుత్వం 2023 డిసెంబర్ 9ను కట్ ఆఫ్ డేట్‌ను ప్రకటించడంతో 156 మంది రైతులు రుణమాఫీ కాదేమో అని కలత చెందుతున్నారు. డిసెంబర్ 15 తర్వాత ఆన్‌లైన్ ఎంట్రీ చేయడమే వారికి శాపంగా మారింది. సిరికొండ సంఘానికి చెందిన 132 మంది రైతులు 86 లక్షల 46వేలపై చిలుకు రుణాలు మాఫీ కాకుండా మిగిలి పోతాయేమని ఆందోళన చెందుతున్నారు. తూంపల్లి సహకార సంఘానికి చెందిన 24మంది రైతులకు చెందిన 22లక్షల 70వేల రుణాలు మాఫీ అవుతాయ లేదా అని సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో పనిచేసే సిబ్బంది తీవ్ర జాప్యం చేయడమే కాకుండ నిర్లక్ష్యం చేయడమే తమకు శాపంగా మారిందని రైతు రామస్వామి గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. రుణాలు మాఫీ కాకుంటే ఆందోళన చేస్తామని సిబ్బందిని రైతులు హెచ్చరిస్తున్నారు. లక్షా 40 వేలు పంట రుణం తీసుకోగా సహకార సంఘ సిబ్బంది చేసిన పొరపాటుకు తనకు రుణమాఫీకి దూరమయ్యానని బాడాల సంతోష్ ఆవేదన వ్యక్తంచేశారు. రుణమాఫీ కోసం రైతులందరి బాబితాను ప్రభుత్వానికి పంపించామని సిరికొండ, తూంపల్లి సహకార సంఘాల క్యాదర్శులు మహ్మద్ అలీ, దేవిలాల్ చెప్తున్నారు. 2023 డిసెంబర్‌లో కొనుగోలు కేంద్రాల పనుల్లో బిజీగా ఉండడంతో ఆన్‌లైన్ చేయడం ఆలస్యమైందని వివరించారు. ఈ రైతుల విషయాన్ని ఎప్పటికప్పుడు సహకార శాఖ ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు చెప్పారు. ఇదే విషయం ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి దృష్టికి తీసికెళ్లినట్లు సిరికొండ సహకార సంఘ కార్యదర్శి మహ్మద్ అలీ చెప్పారు.



మాట్లాడుతున్న టీడీపీ అధ్యక్షుడు

నాసిరకం రోడ్లతో ప్రజలకు ఇబ్బందులు

● రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి
● టీడీపీ నిజామాబాద్ పార్లమెంటరీ అధ్యక్షుడు యాదాగౌడ్

సుభాష్‌నగర్, జూలై26: వారంరోజుల నుంచి కురిసిన వర్షాలకు నాసిరకం రోడ్లు గుంతలు తేలి ప్రజలకు ఇబ్బందికరంగా మారాయని, ప్రభుత్వం వెంటనే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని టీడీపీ నిజామాబాద్ పార్లమెంటరీ అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంట్రాక్టర్లు డబ్బుల కోసం నాసిరకంగా రోడ్లు వేయడం వల్ల గుంతలు తేలాయని అన్నారు. అధికారులు దీనిపై స్పందించి రోడ్లను బాగు చేయాలన్నారు. వాతావరణంలో మార్పుల దృశ్యావ్యాధులు పెరుగుతున్నాయని, ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. బడ్జెట్‌లో షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామనడం సంతోషకరమని, ఆగస్టు 15లోపు 2లక్షల రుణమాఫీ చేయాలని అన్నారు. మాధవనగర్ రైల్వేబ్రిడ్జి పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని ఎంపీ అర్వింద్ ప్రత్యేక చొరవ తీసుకొని త్వరగా జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ ఓబీసీ మహాసభ పోస్టర్ల ఆవిష్కరణ

నిజామాబాద్ అర్బన్, జూలై 26: ఆగస్టు 7న అమృత్‌సర్‌లో జరిగే అఖిల భారత జాతీయ ఓబీసీ మహాసభ పోస్టర్లను శుక్రవారం జిల్లా కేంద్రంలోని కేర్ కళాశాలలో విడుదల చేశారు. మండల్ డే సందర్భంగా ప్రతీ సంవత్సరం ఆగస్టు 7న ఓబీసీ జాతీయ మహాసభలను నిర్వహించనున్నామని, ఇందులో భాగంగా ఈ ఏడాది పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో జరిగేఅఖిల భారత జాతీయ ఓబీసీ మహాసభకు జిల్లా నుంచి పెద్దసంఖ్యలో బీసీలు తరలివచ్చి విజయవంతం చేయాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరాల సుధాకర్ కోరారు. దేశవ్యాప్తంగా బీసీల కులగణన నిర్వహించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, ప్రైవేటు రంగాలలో బీసీలకు, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. బీసీలకు రాజ్యాధికారమే ధ్యేయంగా మహాసభ నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆకుల ప్రసాద్, కరిపె రవీందర్, వినోద్‌కుమార్, శంకర్, శ్రీలత, స్వామి, రాజు, నర్సయ్య పాల్గొన్నారు.

రెంజల్ ఎంపీడీవోగా జాదవ్ వెంకటేష్

రెంజల్,జూలై26: రెంజల్ మండల ఎంపీడీవోగా జాదవ్ వెంకటేష్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇదివరకు ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాస్ నుండి శుక్రవారం జాదవ్ వెంకటేష్ పూర్తిస్థాయి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. బోధన్ ఎంపీడీవోగా పని చేసిన వెంకటేష్ బదిలీపై శుక్రవారం రెంజల్ ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు.

దోమకొండలో చెక్కుల పంపిణీ

దోమకొండ : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి అధికారులతో కలసి సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చిన 21 చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, తహసీల్దార్ సంజయ్‌రావు, బీజేపీ నాయకులు కుంట లక్ష్మారెడ్డి, మద్దూరి భూపాల్‌రెడ్డి, చింతల రాజేష్, గణేష్, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మనోజ్, జగదీశ్, రవి, విఠల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు చెల్లించాలి'

పెద్దబజార్, జూలై26: మధ్యాహ్న భోజనానికి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచకుండా వారికి రావాల్సిన బకాయి బిల్లులు చెల్లించకుండా కార్మికులతో చెలగాటం ఆడుతున్నారని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి ఓమయ్య, తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి అన్నారు. శుక్రవారం నగరంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మధ్యాహ్న భోజన కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారని అన్నారు. గత నాలుగు నెలలుగా ఆందోళనలు చేస్తున్నా నేటికీ కోడిగుడ్లు 8, 9 తరగతుల బిల్లులు చెల్లించలేదని, రూ.10వేల వేతనంపై స్పష్టత ఇవ్వడం లేదని అన్నారు. కార్మికులకు ఇన్సూరెన్స్, యూనిఫాం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్‌చేశారు. 31న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్మికులను కోరారు. కార్యక్రమంలో నర్సింలు పాల్గొన్నారు.

వర్సిటీలో బాలికల హాస్టల్, ఇంజనీరింగ్ కళాశాల నిర్మించాలి



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

డిచ్‌పల్లి,జూలై 26: రాష్ట్రంలో యూనివర్సిటీలకు రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.500 కోట్లు కేటాయించడాన్ని పీడీఎస్‌యూ వ్యతిరేకిస్తోందని పీడీఎస్‌యూ జిల్లా ప్రధానకార్యదర్శి రాజేశ్వర్ స్పష్టం చేశారు. టీయూలో ఇంజనీరింగ్, బాలికల హాస్టల్, స్టేడియం నిర్మించాలని, వర్సిటీకి రూ.200 కోట్ల బడ్జెట్‌ను కేటాయించి రెగ్యూలర్ వీసీని నియామించాలని డిమాండ్లతో కూడిన వినతిపత్రం రిజిస్ట్రార్ యాదగిరికి పీడీఎస్‌యూ నాయకులు అందజేశారు.

కుక్కల దాడిలో కృష్ణ జింక మృతి

బోధన్‌రూరల్, జూలై 26: సాలూర మండలంలోని తగ్గెల్లి గ్రామంలో కుక్కలు కృష్ణ జింకను వేటాడి చంపాయి. శుక్రవారం తెల్లవారుజామున తగ్గెల్లి గ్రామ పరిసరాలలో జి ంక మృతి చెంది పడి ఉండడం చూసి గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని అటవీ శాఖ అధికారులకు తెలియజేశారు. అనంతరం ఎస్సై నాగనాథ్, అటవీశాఖ అధికారి చంద్రప్రకాష్ ఘటన స్థలానికి చేరుకుని మృతి చెందిన జింకను పరిశీలించారు. కుక్కలు చిన్న పిల్లల ప్రాణాలు, అడవి జంతువుల ప్రాణాలు తీస్తున్నప్పటికీ ప్రభుత్వ అధికారులు నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడ్డారు. మృతిచెందిన జింకను అటవీశాఖ అధికారులు పోస్టుమార్టం నిమిత్తం వెటర్నరీ ఆసుపత్రికి తరలించారు.

పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

● డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజు

బోధన్ రూరల్, జూలై 26: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజు అన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వోగా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన రాజు రాకాసిపేట్, భీమునిగుట్ట ప్రభుత్వ హాస్టల్‌ను సందర్శించి అక్కడ పరిసరాల పరిశుభ్రత గురించి పిల్లలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సాలూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. సీజనల్ వ్యాధుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శివాలయం పరిసరాలతో పాటు పలు కాలనీలో పర్యటించారు. ఆయన వెంట సూపర్‌వైజర్‌లు డాక్టర్ నిర్మల పాల్గొన్నారు.



వార్డుల్లో పర్యటిస్తున్న దృశ్యం



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్డీవో రాజేశ్వర్

ఎంతోమంది ప్రాణత్యాగ ఫలమే కార్గిల్ యుద్ధవిజయం: బోధన్ ఆర్డీవో

బోధన్‌రూరల్, జూలై26: ఎంతోమంది ప్రాణత్యాగ ఫలమే కార్గిల్ యుద్ధ విజయమని బోధన్ ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో కేంద్రసమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయదివస్ రజతోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 ఏళ్ల క్రితం ఎంతోమంది జవాన్లు ప్రాణాలు త్యాగం చేసి దేశానికి కార్గిల్ యుద్ధవిజయాన్ని అందించారన్నారు. 1999లో పాకిస్థాన్ సైనికులు, ఉగ్రవాదులు భారత భూభాగాన్ని ఆక్రమించుకోవాలని పాక్ చేసిన ప్రయత్నాన్ని ఆపరేషన్ విజయ్‌తో కార్గిల్ నుంచి పాక్ సైనికులను తరిమికొట్టారన్నారు. ప్రతీఒక్కరు వీరులను స్మరించుకోవాలన్నారు. యువతలో చిన్నతనం నుంచి దేశభక్తి పెంపొందించుకోవాలన్నారు.

● భారతీయ సైనికుల పోరాటం అసామాన్యం: ఏసీపీ

భారతీయ సైనికుల పరాక్రమం ప్రేరణదాయకం వారి త్యాగం నిత్యం స్మరణీయమని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. దేశ సరిహద్దుల్లో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ దేశప్రజలకు రక్షణగా నిలుస్తున్న మన దేశసైనికుల పోరాటం అసామాన్యమని అన్నారు. కార్గిల్ యుద్ధంలో వీరోచితంగా పోరాడి వీరమరణం పొందిన అమర జవాన్లకు ప్రతి ఒక్కరు స్మరించుకోవాలన్నారు. అనంతరం విధి నిర్వహణలో మృతిచెందిన వీరజవాన్ గంగాప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి తల్లిదండ్రులను సన్మానించారు. రజతోత్సవ వేడుకల్లో నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస, దేశభక్తి గేయాల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. బోధన్ డిగ్రీ కళాశాల నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటి ఆఫీసర్ ధర్మ నాయక్, బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సురేష్, జిల్లా మహిళ సంక్షేమ శాఖ అధికారిణి ఎస్‌కే.రసూల్‌బీ, సీడీపీవో జానకి, తదితరులు ఉన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

● ఒకరి మృతి, మరొరికి తీవ్రగాయాలు



పొదల్లోకి దూసుకెళ్లిన కారు

ఆర్మూర్‌టౌన్, జూలై26: పట్టణంలోని 63వ జాతీయరహదారి దోబిఘాట్ సమీపంలో వేగంగా వచ్చిన కారు బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రం కడెం ఖానాపూర్ మండలం బదంకూర్తి గ్రామానికి చెందిన మంత్ర రాజ్యంనరేష్, పారెపల్లి నగేష్ బైకుపై వస్తున్నారు. ఈక్రమంలో నిజామాబాద్ నుంచి ఆర్మూర్‌వైపు వేగంగా వస్తున్న కారు అదే రూట్‌లో బైక్‌పై వస్తున్న నరేష్, నగేష్‌లను ఢీకొట్టి కొద్దిదూరంపాటు ఈ డ్చుకెళ్లి పొదల్లోకి వెళ్లి ఆగింది. కారు హెయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో కారులో ఉన్న వారికి ప్రమాదం సంభవించలేదు. ప్రమాదంలో గాయాలైన ఇద్దరిని స్థానికులు 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మార్గంమధ్యలో నరేష్ (43) మృతిచెందాడని డాక్టర్ రేష్మ తెలిపారు. నగేష్ తలకు, కాళ్లకు గాయాలవడంతో జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనాస్థలాన్ని ఎస్సై అశోక్ పరిశీలించారు. మృతుడికి భార్య సునీత, కుమారుడు, కూతురు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను లబ్దిదారులకు అందిస్తున్న ఎమ్మెల్యే


కామారెడ్డిటౌన్, జూలై 26 : వర్షాలు పడి పంటలు బాగా పండితే రైతులు ఆనందంగా ఉంటారని, వారు ఆనందంగా ఉంటేనే మనందరికీ ఆనందమని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో అన్నికులాలతో సమ్మిళితమైన కామారెడ్డి అభివృద్ధి సదరు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఊరడమ్మ పండుగ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం మొదలైనా వర్షాలు లేకపోవడంతో రైతులు నెలన్నర క్రితం వరకు ఎంతో ఆందోళనకు గురయ్యారని, గ్రామదేవతలకు ఎన్నో పూజలు నిర్వహించి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో దేవత లకు బోనాలు సమర్పించారని అన్నారు. దీంతో దేవతల అనుగ్రహంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రైతులలో ఆనందం వ్యక్తం అవుతుందని, వర్షాలు మరింత పడి చెరువులు, కుంటలు కళకళలాడాలని అన్నారు. ప్రతిఏటా కామారెడ్డి పట్టణంలో ఊరడమ్మ పండుగను ఘనంగా నిర్వ హించడం హర్షించదగిన విషయమని, అమ్మవారి ఆశీస్సులు అందరికి ఉండి ఎలాంటి వ్యాధులు బారినపడకుండా చూసుకోవాలని అమ్మవారిని కోరినట్లు తెలిపా రు. అదే విధంగా సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కామారెడ్డి మండల, పట్టణానికి చెందిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే లబ్దిదారుల కు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాజంపేట/మాచారెడ్డి/బీబీపేట:కామారెడ్డి నియోజవర్గంలోని రాజంపేట,మాచారెడ్డి, బీబీపేట మండలాల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన సీఎంఆర్‌ఎఫ్ లబ్దిదారులకు శుక్రవారం ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి చెక్కులను పంపిణీచేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపద సమయంలో వైద్యఖర్చుల నిమిత్తం బాధిత కుటుంబానికి అండగా ఉండే ఉద్దేశ్యంతో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయామండలాల అధికారులుపాల్గొన్నారు.

బాన్సువాడ అభివృద్ధికి కృషి

● మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ, జూలై 26 : రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అత్యధికంగా 11 వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరైన ఏకైక నియోజకవర్గం బాన్సువాడ అని ఎమ్మెల్యే పోచారం శ్రీని వాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాన్సువాడ నియోజకవర్గంలోని కోటగిరి, బాన్సువాడ పట్టణంలో ఆగ్రోఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి డబుల్ బెడ్‌రూమ్ బిల్లు చెక్కులను పంపిణీ చేశారు. డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించిన బిల్లులు గత ప్రభుత్వంలో 93 శాతం వచ్చాయని, మరో రూ.20 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రస్తుతం 8 కోట్లు బిల్లులు విడుదల చేయడం జరిగిందన్నారు. బిల్లులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌ఛైర్మన్ జంగం గంగాధర్, పోచారం సురేందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పోచారం

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

రెంజల్,జూలై26: లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికుల పట్ల ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వీడనాడి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికులు వినతిపత్రాన్ని అందజేసి నిరసన తెలిపారు. నెల రోజుల నుంచి నిరసన తెలుపుతున్న కార్మికులకు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తమ ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని లేని యెడల సమ్మెను తీవ్రతరం చేస్తామని కార్మికులు హెచ్చరించారు. చాలిచాలని వేతనాలతో పనులు కొనసాగిస్తున్న లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికులను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందని, ప్రభుత్వం స్పందించకపోతే లిఫ్ట్ కార్మికులందరు పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రూపేష్, విఠల్, ప్రవీణ్, సందీప్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి'

సిరికొండ జులై 26 : తెలంగాణ రాష్ట మాడల్ స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని కోరుతూ మాడల్ స్కూల్ ముందర ఉపద్యాయులు నిరసన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో మాడల్ స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టక పోవడం బాదకరమని ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు అన్నారు.గత ఏడాది ప్రభుత్వం బదిలీలు చేపట్టగా కొంతమంది ఉపద్యాయులు కోర్టును ఆశ్రయించడంతో ప్రభుత్వం ప్రక్రీయను నిలిపివేసిందని ఉపాధ్యాయులు తెలిపారు. దీంతో ఏడకొండేళ్లుగా మాడల్ స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు బదీలల కోసం ఎదిరి చూస్తున్నారని బదిలీల ప్రక్రీయ నిలిచిపోయిందన్నారు. ప్రభుత్వం వెంటనే మాడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం

వర్ని,జూలై26: చందూర్ మండల కేంద్రంలో శుక్రవారం రోడ్డు మరమ్మత్తు పనులు ప్రారంభం అయ్యాయి. గుంతలుగా ఏర్పడిన రోడ్డును చదును చేశారు. నెల రోజుల్లో చందూర్ నుంచి జలాల్‌పూర్ వరకు గల బీటీ రోడ్డు పనులు చేపడతామని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చినట్లు స్థానిక నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విండో ఛైర్మన్ ప్యారం అశోక్, మాజీ ఎంపీపీ లావణ్య రాంరెడ్డి, కర్లం సాయిరెడ్డి, రాజిరెడ్డి, జయరాం, కార్యదర్శి పెర్క సాయిలు పాల్గొన్నారు.



మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బందితో సమావేశం

మద్నూర్, జూలై 26 : గ్రామీణ ప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, వారికి అందుబాటులో ఉండాలని, డోంగ్లి పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీలేఖ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంలు, ఎంపీహెచ్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పని చేస్తున్న వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుతం వర్షాకాలంలో మలేరియా, ఫైలేరియా, హెపటైటిస్ బి తదితర రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని, ముందస్తుగా ఇంటింటి సర్వే నిర్వహించి వ్యాధులను గుర్తించిన తగిన చికిత్స అందించాలని అన్నారు. అదే విధంగా ప్రతి గర్భిణీ స్త్రీ ప్రభుత్వ దవాఖానాలోనే ప్రసవం జరిగేటట్లు ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు చూడాలని సూచించారు. వయసు పై బడిన వారికి పలు రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించనున్నట్లు తెలిపారు. ఆశా వర్కర్లు గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. డోంగ్లి ప్రభుత్వ ఆసుపత్రిలో వారం వారం నిర్వహించే మహిళా ఆరోగ్య శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు ఉచితంగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ రవి, లక్ష్మీ, యాదమ్మ, పీహెచ్‌సీ, ఏఎన్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తిరుగుతూ ఆరోగ్య సర్వే

బీర్కూర్, జూలై 26 : వైద్య ఆరోగ్య శాఖ అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం బీర్కూర్ మండలంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు ఇంటింటికి తిరుగుతూ జ్వర సర్వే నిర్వహించారు. ప్రస్తుతం వర్షాకాలంలో పరిసరాలు అపరిశుభ్రంగా మారి దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. దోమల వల్ల సీజనల్ వ్యాధులు పెరుగుతున్నాయి. ఈ సమస్య మరింత పెరిగే అవకాశం ఉండటంతో ఆరోగ్య శాఖ అధికారులు జ్వర సర్వే చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు గ్రామ గ్రామాన ఇంటింటికి తిరుగుతూ జ్వరం, జలుబు, దగ్గు, ఒంటి నొప్పులతో బాధపడుతున్న వారి వివరాలను సేకరిస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పీహెచ్‌సీకి తరలించి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నారు.

రూరల్ ఎంపీవోకు వీడ్కోలు



మధురిమను అభినందిస్తున్న సిబ్బంది

నిజామాబాద్ రూరల్, జూలై 26: రూరల్ మండల ఎంపీవోగా, ఇన్‌చార్జి ఎంపీడీవోగా విదులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఎ.మదురిమకు తోటి ఉద్యోగులు వీడ్కోలు పలికారు. శుక్రవారం రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవో ఇక్బాల్ వీడ్కోలు కార్యాక్రమం నిర్వహించారు. ఎంపీవోగా ఐదేళ్ల పదవీకాలం పూర్తిచేసుకుని బదిలీపై మోస్రా మండల ఎంపీవోగా వెళ్తున్న మధురిమతో తోటి ఉద్యోగులు తమ అనుభవాలు పంచుకున్నారు. నిక్కచ్చిగా, నిజాయితీ పనిపట్ల బాధ్యతగా విధులు నిర్వహిస్తూ తోటి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించారని పంచాయతీ కార్యదర్శులు తమ అనుభవాలు పంచుకున్నారు, నిజామాబాద్ మండలాన్ని ఈజీఎస్, పన్నుల వసూళ్లలో టాప్ జాబితలో నిలబెట్టారు. మండలంలోని పాల్ద గ్రామానికి జాతీయస్థాయిలో ఉత్తమ గ్రామంగా ఎన్నికకావడంతో మధురిమ కృషి ఎనలేనిది. మధురిమకు పంచాయతీ కార్యదర్శులు శాలువా కప్పి, మెమొంటోలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ఇక్బాల్, సూపరింటెండెంట్ ప్రవీణ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సుధాకర్ రెడ్డి, విష్ణు నాయక్, కె.ఉమ, ప్రియాంకరాజ్, నిఖిత, శ్యామల, స్వాతి, సిబ్బంది ప్రశాంత్‌కుమార్, శివ, ఉమాదేవి, పవన్‌కుమార్, లక్ష్మయ్య ఉన్నారు.

కులం పేరుతో దూషించిన ఒకరికి ఏడేళ్ల జైలు శిక్ష

నిజామాబాద్ లీగల్, జూలై 26 : వ్యవసాయ భూమిలో ఉన్న తుంపర పైపులను తగలబెట్టి యజమానిని భూమి అమ్మమని కులం పేరుతో దూషించిన వ్యక్తికి ఏడుసంవత్సరాల జైలుశిక్ష విధిస్తూ ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి టి.శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే... 25-5-2020 రోజున ఏర్గట్ల మండలం దాత్రి గ్రామానికి చెందిన కుండ చిన్నసాయిలు తన వ్యవసాయ చేసుకొని జీవించేవాడు. సర్వే నెంబర్ 557/1 ఉన్న వ్యవసాయ భూమిని దౌర్జన్యంగా లాగేసుకోవాలనే ఉద్దేశంతో తన పొలంలో ఉన్న తుంపర పైపులను తగలబెట్టి, భూమి యజమానిని భూమిని అమ్మమని లేకుంటే చంపేస్తానని కులంపేరుతో దూషించిన ముద్దాయి మునిగె చిన్న లింబాద్రి (అలియాస్ కత్తి) బెదిరించడంతో పోలీసు వారు కేసు నమోదు చేసుకొని సాక్ష్యాధారాలతో కోర్టులో హాజరుపర్చగా పోలీసువారి తరపున పీపీ బంటు వసంత్ వాదించగా సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి ముద్దాయి చేసిన నేరానికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ, 4,700 రూపాయల జరిమానా చెల్లించాలన్నారు. జరిమానా చెల్లించని యెడల ఆరునెలల జైలు శిక్ష విధించాలని తీర్పుచెప్పారు.

కోర్టులో సాక్షి ఫొటోలు తీసిన నిందితుడిపై కేసు

నిజామాబాద్ లీగల్, జూలై 26 : మొదటి అదనపు జిల్లా కోర్టులో ఓ కేసులో సాక్షం చెప్పడానికి వచ్చిన సాక్షిని ఫొటో తీయగా నిందితుడిపై కేసు నమోదైంది. ఈ విషయం న్యాయాధికారికి తెలపడంతో వెంటనే కోర్టు పోలీసులను పిలిపించి మాట్లాడారు. ఒకటోటౌన్‌లో సాక్షి ఫిర్యాదు మేరకు నిందితుడిపై బీఎన్ఎస్ 351, 232 సెక్షన్‌లపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా మొదటి అదనపు జిల్లా జడ్జి కనకదుర్గ మాట్లాడుతూ కోర్టుకు వచ్చిన సాక్షిని ఎవరైనా ఫోటోలు తీసినా, బెదిరించిన, బ్లాక్‌మెయిల్ చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇద్దరు మట్కారాయుళ్ల అరెస్టు

ఖిల్లా, జూలై 26 : నగరంలోని ఒకటోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మట్కా స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ బృందం ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఖచ్చితమైన సమాచారం మేరకు సీపీ కల్మేశ్వర్ సింగనెవార్ ఆదేశాలపై మట్కా ఆడుతున్న అబ్దుల్ అజీజ్, అబ్దుల్ సుశిత్‌లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 6,290 రూపాయల నగదు, మట్కా చీటీలను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి కేసు నమోదు కోసం వీరిని ఒకటోటౌన్ పోలీసులకు అప్పగించారు.

ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలి : ఎంపీడీవో

రుద్రూరు, జూలై 26 : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని ఎంపీడీవో సురేష్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం వన మహోత్సవంలో భాగంగా రుద్రూరు మండల సమీకృత కార్యాలయం వద్ద ఆయన మొక్కలను నాటారు. అనంతరం కేజీబీవీ పాఠశాలను సందర్శించి పరిసరాలను పరిశీలించారు. పాఠశాల పరిసర ప్రాంతాలలో పిచ్చి మొక్కలను తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతిఒక్కరూ ఆరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అప్పుడే పచ్చదనం పరిశుభ్రత ఏర్పడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం లేకుండా చూడాలని, ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని గ్రామ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీవో మనోహర్, రుద్రూరు పంచాయతీ కార్యదర్శి గంగాధర్, టెక్నికల్ అసిస్టెంట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో కొండాపూర్‌లో పీహెచ్‌సీ ఏర్పాటు

రాజంపేట, జూలై 26 : మండలంలోని కొండాపూర్‌లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పీహెచ్‌సీ కావాలని గత ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని కాంగ్రెస్ నాయకులు తెలి పారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా మదన్‌మోహన్ రావు గెలుపొందడంతో ఆయన చొరవ తీసుకుని కొండాపూర్‌లో పీహెచ్‌సీ ఏర్పాటుకు సభదృష్టికి తీసుకెళ్లడం హర్షించదగిన విషయమన్నారు. అదే విధంగా రైతులకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్ర బడ్జెట్ ప్రారంభించడం ఎంతో సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రణీత్‌రెడ్డి, జిల్లా ఎస్టీసెల్ వైస్‌ప్రెసిడెంట్ వినోద్‌కుమార్, మండల ఉపాధ్యక్షులు బస్సీలాల్, శ్రీధర్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ



కాగడాల ర్యాలీ నిర్వహిస్తున్న బీజేవైఎం నాయకులు

కామారెడ్డిటౌన్, జూలై 26 : కార్గిల్ యుద్ధంలో విజయం సాధించి 25 సంవత్సరాలు గడిచిన సందర్భంగా బీజేవైఎం ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మల్క్యాయశస్వి మాట్లాడుతూ భారతదేశ సైనికులు పాకిస్థాన్ సైన్యంపైన వీరోచిత పోరాటం చేసి ఘనవిజయం సాధించారన్నారు. జవాన్ల సేవలకు గుర్తుగా నివాళి అర్పించామని తెలిపారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నందివేణు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వినతి

కామారెడ్డిటౌన్, జూలై 26 : మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి వద్ద గల గాయత్రి షుగర్‌ఫ్యాక్టరీ యాజమాన్యం రుణాలపేరిట రైతుల ప్రమేయం లేకుండా కోట్లరూపాయలను రుణాలు తీసుకుని మోసానికి పాల్పడిందని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ షుగర్ ఫ్యాక్టరీలో సభ్యత్వం ఉన్న రైతు నుంచి పాసుబుక్‌లను ఫ్యాక్టరీ యాజమాన్యం చర్యలు తీసుకుని వారి పేరిట బ్యాంకులో రుణాలను తీసుకోవడం సిగ్గుచేటన్నారు. బ్యాంక్ యాజమాన్యం సైతం ఏ విధంగా రుణాలను అందిస్తుందన్నారు. ప్రభుత్వ అధికారులు ఈ కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైనటువంటి ఫ్యాక్టరీ యాజ మాన్యం, బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ నాయకులు ప్రకాష్‌కిషోర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ టాపర్లకు అభినందన

కామారెడ్డిటౌన్, జూలై 26 : గత విద్యాసంవత్సరం ఉత్తమంగా విద్య నభ్యసించి యూనివర్సిటీ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఆర్కే విద్యార్థులను తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్ హారతి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తకోర్సులు ప్రవేశపెట్టడంతో పాటు ఉత్తమంగా బోధిస్తు విద్యార్థులను ప్రోత్సహించడంలో ఆర్కే కళాశాల అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్కే గ్రూప్‌సీఈవో జైపాల్‌రెడ్డి, యూనివర్సిటీ అధ్యాపకులు ప్రసన్న, ప్రిన్సిపాల్ సైదయ్య, నవీన్, గోవర్ధన్, గంగాధర్, వైస్ ప్రిన్స్‌పాల్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

'ముదిరాజ్ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి'

కామారెడ్డిటౌన్, జూలై 26 : తెలంగాణ రాష్ట్రంలో 56 లక్షల జనాభా ఉన్న ముదిరాజ్‌ల అభివృద్ధికి ఈ బడ్జెట్‌లో రూ.1000 కోట్లు కేటాయించాలని కామారెడ్డి జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గజ్జెలబిక్షపతి అన్నారు. ముదిరాజ్‌ల శ్రేయస్సు కోసం ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, కాని ప్రస్తుతం కేటాయించిన రూ.50 కోట్లు సరిపోవన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వ సంక్షేమాలకు దూరంగా ఉంటున్న ముదిరాజ్‌లను ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీఏలోకి మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు.

దోమకొండలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

దోమకొండ, జూలై 26 : మండల కేంద్రంలోని శ్రీ చాముండేశ్వరీ ఆలయం ఆవరణలో శుక్రవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో వైద్యురాలు కీర్తన మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్రీనివాస్‌గౌడ్, ప్రసాద్, గ్రామస్థులు శ్యాం, రామస్వామిగౌడ్, నర్సింలు, కిషన్, భూపతిగోపాల్, గంగాగౌడ్ పాల్గొన్నారు.

భిక్కనూరు ఎంపీవోకు సన్మానం

భిక్కనూరు, జూలై 26 : భిక్కనూరు ఎంపీవోగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డిని శుక్రవారం తన కార్యాలయంలో రామేశ్వర్‌పల్లి గ్రామస్థులు సన్మానించారు. ఈ మేరకు వారు ఎంపీవోను శాలువతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఎంపీవో మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వీడీసీ మాజీ అధ్యక్షుడు తక్కళ్లనర్సారెడ్డి, విండో ఉపాధ్యక్షుడు కందడి లక్ష్మారెడ్డి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల తనిఖీ

మద్నూర్, జూలై 26 : మండల కేంద్రంలోని మద్యం దుకాణాలను బిచ్కుంద ఎక్సైజ్ ఎస్సై నగేష్ ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. మద్నూర్ మహారాష్ట్రకు సరిహద్దులో ఉన్నందున అక్కడి నుంచి అక్రమంగా దేశీదారు వస్తున్న సమాచారం మేరకు గ్రామీణ ప్రాంతాలలో గల పలు దుకాణాలను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని మద్యం దుకాణాలలో ఉన్న బ్రాండ్లను పరిశీలించారు. తనిఖీలలో హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య, సిబ్బంది శ్రీధర్, అనిత, దేవిసింగ్ తదితరులు ఉన్నారు.



మద్నూర్‌లో మద్యం దుకాణం తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- బాన్సువాడ ఆర్డీవో రమేష్ రాథోడ్

బాన్సువాడ, జూలై 26 : వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు ఎలాంటి రోగాల బారిన పడకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని బాన్సువాడ ఆర్డీవో రమేష్ రాథోడ్ సూచించారు. శుక్రవారం మండలంలోని తిరుమలాపూర్ మొగాన్‌పల్లి తండా, తాడ్కోల్ గ్రామాలతో పాటు రాజారాం దుబ్బ పరిసర ప్రాంతాలలో ఆర్డీవో రమేష్‌రాథోడ్ పర్యటించారు. ఎంపీడీవో కార్యాలయంలో మొక్కలు నాటారు. అనంతరం రాజారాం దుబ్బలో అంగన్ వాడీ కేంద్రంతో పాటు పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులకు వండుతున్న మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. తిరుమలాపూర్, మొగలంపల్లి తండాల్లో కంపోస్టు షెడ్లను, డ్రైనేజీలను ప్రభుత్వ పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణ పాల్గొన్నారు.



హాజరుపట్టికను పరిశీలిస్తున్న ఆర్డీవో

వన మహోత్సవం విజయవంతం చేయాలి

- ఎల్లారెడ్డి ఆర్డీవో

గాంధారి : వనమహోత్సవ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములై మొక్కలను నాటాలని ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కామారెడ్డి-బాన్సువాడ ప్రధాన రహదారి మధ్యలో కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం డివైడర్ మధ్యలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఇంటి ముందు ఇంటి పరసరాలలో మొక్కలను నాటాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్‌రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, మాజీ ఎంపీటీసీ తూర్పురాజు, సంతోష్, లైన్‌రమేష్, శంకర్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిధుల కేటాయింపులో అన్యాయం

- రాష్ట్ర బడ్జెట్‌పై బీజేపీ ఆగ్రహం

బాన్సువాడ, జూలై 26 : భారతీయ జనతా పార్టీ బాన్సువాడ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ గత ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ పెట్టిన సంక్షేమ పథకాల కోసం గురువారం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమ పథకాల కోసం నిధులు కేటాయించక పోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి మక్కన్న, జిల్లా అధికార ప్రతి నిధి హన్మాండ్లు, మండల అధ్య క్షులు సాయికిరణ్, సాయిబాబా, పట్టణ ప్రధాన కార్యదర్శి పాశం భాస్కర్‌రెడ్డి, పాల్గొన్నారు.

బడ్జెట్ ప్రతులు కాల్చి నిరసన

కామారెడ్డిటౌన్, జూలై 26 : విద్యారంగానికి తక్కువగా నిధులు కేటాయించడం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులను చదువుకు దూరం చేయడమేనని బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీకళాశాల వద్ద బడ్జెట్ ప్రతులను కాల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటా యించడం సిగ్గుచేటని అన్నారు. స్కాలర్ షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ గత నాలుగు సంవత్సరాల నుంచి రూ.8 వేల కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని ఆయన అన్నారు. వాటిని విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని ఆరోపించారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తామని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇలా తక్కువ నిధులు కేటాయించడం దుర్మార్గమని ఆయన అన్నారు. విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయిం చాలని డిమాండ్ చేస్తే ప్రభుత్వం 7.30 శాతం నిధులు కేటాయించడం సరికాదని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠ శాలలు, గురుకులాలు, కళాశాలల నుంచి యూనివర్సిటీ దాకా సమస్యలకు నిలయాలుగా మారాయని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో బీవీఎం నాయకులు యోగేష్, సాయితేజ, చరణ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఐఆర్ కాపీలు ఇప్పించాలని ఉద్యమకారుల వినతి

బాన్సువాడ, జూలై 26 : తెలంగాణ ఉద్యమకారులపై నమోదైన కేసులకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీలను డివిజన్‌లోని అన్ని పోలీస్‌స్టేషన్ల నుంచి ఇప్పించాలని కోరుతూ శుక్రవారం బాన్సువాడ మండల మలిదశ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి డీఎస్పీ కార్యాలయంలోని పరిధిలో గల పోలీస్‌స్టేషన్‌లలో ఉద్యమకారులకు సంబంధించిన ఉద్యమకారులపై 2009 నుంచి 2014 వరకు పెట్టిన కేసుల యొక్క ఎఫ్ఐఆర్ కాపీలను ఇప్పించే విధంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐలకు ఆదేశాలు ఇవ్వాలని వారు డీఎస్పీని కోరారు. సానుకూలంగా స్పందించిన డీఎస్పీ సత్యనారాయణ ఉద్యమకారులకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీలను వెంటనే అందజేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం డీఎస్పీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యమకారులు ఉడుత గంగాధర్, గంజి వారి చందు, మారుతి, భాస్కర్‌గౌడ్, రాజు, గంగారాం, కాల్వశ్యామ్ పాల్గొన్నారు.



డీఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యమకారులు

పల్లెల్లో సమస్యలు తీర్చండి : జడ్పీసీఈవో



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

సదాశివనగర్, జూలై 26 : అన్ని గ్రామాలలో శానిటేషన్ పనులను పక్కగా చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా చూడాలని జడ్పీ సీఈవో చందర్ నాయక్, మండల ప్రత్యేకాధికారి రమేష్ బాబులు తెలిపారు. శుక్రవారం మండలంలోని భూంపల్లి, పద్మాజీవాడి గ్రామాల్లో పర్యవేక్షించి శానిటేషన్, నర్సరీ, ప్లాంటేషన్ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం వ్యాధులు సంక్రమించే ప్రభావం అధికంగా ఉన్నందున గ్రామాలలో మురుగు కాలువలు శుభ్రంచేస్తు తాగునీరుపై ప్రత్యేక దృష్టిసారించి ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా చూడాలన్నారు. కార్యక్రమం లో మండల పంచాయతీ అధికారి సురేందర్‌రెడ్డి, ఏపీవో మధు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రాజంపేట : మండల కేంద్రంతో పాటు కొండాపూర్, ఆరేపల్లి, ఎల్లారెడ్డిపల్లి, శేర్‌శంకర్‌తండా గ్రామాలలో శుక్రవారం పారిశుధ్య పనులను ఎంపీడీవో రాజేశం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతిరోజు పారిశుధ్య పనులు నిర్వహించాలని, గ్రామసభలు ఏర్పాటుచేసి తాగునీటి సరాఫరా లోపాలు లేకుండా చూడాలని, పైపులైన్ లీకేజీలను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో రఘురాం, కార్యదర్శులు అశోక్, ప్రశాంత్, స్రవంతి పాల్గొన్నారు.

భిక్కనూరు : డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించాలని భిక్కనూరు ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలని ఇసన్నపల్లి, మల్లుపల్లి, బస్వాపూర్ గ్రామాల్లో నిర్వహించిన డ్రైడే కార్యక్రమంలో ఎంపీవో పాల్గొని మాట్లాడారు. ప్రతి రెండులకు ఒక్కసారి నీటి కుండీలోని నీటిని మార్చేలా, కొబ్బరిబొండాలు, ప్లాస్టిక్ వస్తువులు ఇంటి పరిసరాలలో ఉంచకుండా అవగాహన కల్పించాలన్నారు.

దోమకొండ ఆసుపత్రిలో సిబ్బందిని నియమించాలని వినతి



జిల్లా వైద్యాధికారి విజయలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

దోమకొండ, జూలై 26 : మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్యశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయించాలని మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్ గౌడ్ శుక్రవారం కామారెడ్డిలో జిల్లా వైద్యాధికారి విజయలక్ష్మి, మెడికల్ కాలేజ్ సుపరింటెండెంట్ రామ్‌సింగ్‌లకు వినతిపత్రం అందజేశారు. ఆసుపత్రిలో గైనకాలజిస్ట్, డెంటిస్ట్, స్టాఫ్‌నర్స్, ఫార్మాసిస్టు, డ్రెస్సింగ్ సిబ్బంది బదిలీ కావడం వలన ఆసుపత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు కలుగుతున్నాయని వినతిప్రతంలో పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బందిని వెంటనే నియమించాలని కోరారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ దోమకొండ పట్టణ అధ్యక్షుడు సీతారాం, మధు తదితరులున్నారు.

'ప్రజలు ఇంటి పన్నులు చెల్లించాలి'

దోమకొండ, జూలై 26 : మండలంలోని గొట్టిముక్కుల, దోమకొండ గ్రామాలలో శుక్రవారం ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శులు రమేష్, శ్రీనివాస్‌ల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో డ్రైనేజీ, వీధి లైట్స్, నీటిసమస్యలపై ప్రజలు సభదృష్టికి తీసుకువచ్చారు. నూతనంగా ఇన్‌చార్జ్ బాధ్యతలు చేపట్టామని, త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని కార్యదర్శులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీవో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ సిబ్బంది గ్రామాల్లో డ్రైనేజీలు శుభ్రంగా ఉండే విధంగా చూడాలని, సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

క్రీడాకారులకు విద్యార్థుల అభినందన



ఒలంపిక్ రింగ్ ఆకారంలో అభినందనలు తెలుపుతున్న విద్యార్థులు

సదాశివనగర్, జూలై 26 : ప్యారిస్ దేశంలో నిర్వహించే ఒలంపిక్ క్రీడల సందర్భంగా భారతదేశం నుంచి పాల్గొనే క్రీడాకారులకు ధర్మారావుపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు. ఒలంపిక్స్ రింగ్స్ ఆకారంలో కూర్చుని ఆల్‌దబెస్ట్ చెబుతూ అభినందనలు తెలిపారు. భారతదేశం నుంచి క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు మంచి నైపుణ్యత సాధించి దేశానికి పథకాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాస్, హెచ్ఎంలు యూసుఫ్, సదాశివ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శిశు మందిర్ పాఠశాలలో గోరింటాకు మహోత్సవం

బాన్సువాడ, జూలై 26 : ఆషాఢమాసం సందర్భంగా బాన్సువాడ పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో శుక్రవారం గోరింటాకు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థినులు తమ చేతులకు గోరింటాకు పెట్టుకుని ఆషాఢమాసం విశిష్ఠతను తెలిపారు. అలాగే గోరింటాకు చేతులకు పెట్టుకోవడం వలన క్రిములను సంహరిస్తుందని, శరీరంలో వేడిని ఉత్పన్నం చేస్తుందని, విద్యార్థులందరికీ గోరింటాకు పెట్టారు. కార్యక్రమంలో ప్రధాన ఆచార్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మహిళా శక్తి కార్యక్రమంపై సమావేశం

బీర్కూర్, జూలై 26 : మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం మహిళా శక్తి కార్యక్రమంపై మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో మహిళా శక్తి కార్యక్రమంపై ఏపీఎం గంగాధర్ మహిళలకు అవగాహన కల్పించారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా గేదెలు, పెరటి కోళ్ల పెంపకం, పౌల్ట్రీ యూనిట్‌ల ఏర్పాటు, ఫుడ్ ఎంటర్‌ప్రైజెస్ యూనిట్‌లను ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎలా ఎదగవచ్చు అనే దానిపై ఏపీఎం వివరించారు. అలాగే బ్యాంకు లింకేజీ టార్గెట్, స్త్రీ నిధి రుణాలు, బ్యాంకు లోన్ వందశాతం రికవరీ చేయడం తదితర అంశాలపై చర్చించారు. అన్ని గ్రామాల వీవో అధ్యక్షులు, వీవోఏలు, సీసీలు పాల్గొన్నారు.



బీర్కూర్‌లో సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం గంగాధర్

పీఆర్‌టీయూ నసురుల్లాబాద్ అధ్యక్షుడిగా హన్మాండ్లు

నసురుల్లాబాద్, జూలై 26 : నసురుల్లాబాద్ మండల కేంద్రంలో శుక్రవారం పీఆర్‌టీయూ యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, దామోదర్‌రెడ్డి కుషాల్, మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మూడోసారి మండల పీఆర్‌టీయూ యూనియన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా గునిగిరి హన్మాండ్లును ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా శ్రీచంద్, సహ అధ్యక్షులుగా సంజీవులు, మహిళా కార్యదర్శిగా సుజాత, శ్రీనివాస్‌గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ యూనియన్ సభ్యులు, ఉపాధ్యాయుని, ఉపా ధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'రైతులు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోండి'

రాజంపేట, జూలై 26 : కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చిన రైతులు రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి సుప్రజ్యోతి తెలిపారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం రైతుబీమాపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు మరణిస్తే ప్రభుత్వం రూ.5 లక్షల బీమాపరిహారం ప్రభుత్వం ద్వారా సంబంధిత నామినికి ఇవ్వడం జరు గుతుందని తెలిపారు. గ్రామాలలో ఒక్కగుంట నుంచి ఎన్ని ఎకరాలు ఉన్నరైతు అయినా ప్రమాదవశాత్తు కాని ఏ ఇతర కారణాల వల్ల మర ణించినా, బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం రైతు బీమా పథకం ద్వారా అందుతుందన్నారు. కావున రైతులు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు సంబంధిత గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారికి అందిం చాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

వినూత్న ఆవిష్కరణలు చేసే వారికి ప్రోత్సాహం : ఎంపీడీవో



ప్రోగ్రాం క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో

సదాశివనగర్, జూలై 26 : మండలంలోని అన్నిరంగాల్లో నూతన పద్ధతులు వినూత్న ఆవిష్కరణలు చేసేవారిని గుర్తించాలని ఎంపీడీవో సంతోష్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రం లోని రైతువేదికలో ఇంటింటా ఇనోవేటర్ ప్రోగ్రాం క్యాలెండర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాలలో ఎవరైన నూతన పద్ధతులు ఆవిష్కరణ వినూత్న ఆలోచనలతో కొత్తపరికరాలు తయారు చేసేవారు పూర్తివివరాలు, వీడియోలు, ఫొటోలతో సహా గ్రామ కార్యదర్శులు, మండలపరిషత్ కార్యాలయంలో ఆగస్టు మూడు లోపు పంపించాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాసాగర్, ఎంపీవో సురేందర్ రెడ్డి, డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్ గగన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	160	200	220
వెన్‌కాబ్(కిలో)	170	220	230